క్లుప్తంగా

ఎట్టకేలకు సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శ్రీకారం



సాక్షి స్పందన

గన్నవరం: స్థానిక సొసైటీపేటలో గ్రామపంచాయతీ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 4వ తేదీన 'అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ' కథనంలో చెత్తచెదారంతో పూడుకుపోయిన డ్రెయిన్ల సమస్యను వెలుగులోకి వచ్చింది. స్పందించిన గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు సొసైటీపేటలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి అత్యవసర అనుమతులు మంజూరు చేశారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఈ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా పొక్లెయిన్‌తో గురువారం డ్రెయిన్ నిర్మాణానికి తవ్వకాలు చేయడంతో పాటు జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభించారు. త్వరితగతిన డ్రెయిన్ నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురానున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు.

గన్నవరం - ఆగిరిపల్లి రోడ్డు పూర్తి చేయాలని పాదయాత్ర



గన్నవరంరూరల్: గన్నవరం - ఆగిరిపల్లి రహదారిని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్ళం వెంకటేశ్వరరావు కోరారు. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో గొల్లనపల్లి నుంచి గన్నవరం వరకూ గురువారం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆగిరిపల్లి రోడ్డును అసంతృప్తిగా వదిలేశారన్నారు. రోడ్డును అభివృద్ధి చేయకపోవటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాలకులు రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, దుమ్ము, ధూళి వల్ల రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. నాయకులు వెంకటేశ్వరరావు, రంగారావు, శివయ్య, బెనర్జీ, అంజియ్య, ఆంజనేయులు, శివాచారి, నాగేశ్వరరావు, తాతబ్బాయి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సర్జరీ నైపుణ్యాలు పెంచుకోవాలి

డీఎంఈ డాక్టర్ రఘునందనరావు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు సర్జరీ నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రఘునందనరావు అన్నారు. ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్యూచర్ నాటింగ్ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. డాక్టర్ రఘునందనరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు శస్త్ర చికిత్స నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈ వర్క్‌షాపు దోహదం చేస్తుందని తెలిపారు. స్యూచర్ టెక్నిక్‌లు, విధి నిర్వహణ పద్ధతి, రోగులతో అనుసంధానం, నిబద్ధత వంటి అంశాలపై విలువైన సూచనలు ఇచ్చారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యవంతమైన సర్జన్‌లుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ దుర్గారాణి, డాక్టర్ బీఎస్‌పీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో దాదాపు 40 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత

- గన్నవరం స్టేషన్‌లో మౌలిక వసతులు కరువు
- ప్రయాణికుల ఆదరణకు దూరమవుతున్న వైనం
- స్టేషన్‌ను ఆధునికీకరించాలని వినతి



గన్నవరం రైల్వేస్టేషన్ ప్రధాన భవనం



నిర్మానుష్యంగా ఉన్న రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గన్నవరం: నియోజకవర్గ కేంద్రంలోని గన్నవరం రైల్వేస్టేషన్‌కు క్రమంగా ప్రయాణికుల ఆదరణ కరువవుతోంది. రైల్వేస్టేషన్ దూరం కావడం, కనీస సదుపాయలు లేకపోవడంతో రైలు ప్రయాణం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ఇక్కడే ఆగే రైళ్లను కూడా కుదించారు. ప్రస్తుతం ఈ స్టేషన్‌లో రోజుకు నాలుగు మెమో రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. కనీస ఆదాయం కూడా రావడం లేదనే సాకుతో ఈ స్టేషన్ అభివృద్ధిని రైల్వేశాఖ పూర్తిగా విస్మరించింది. దీంతో రైల్వేస్టేషన్ సమస్యలతో కునారిల్లుతుంది. ఇప్పటికైనా రైల్వేశాఖ స్పందించి స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఎక్కువ రైళ్లకు ఇక్కడ హాల్ట్ సదుపాయం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గతంలో 10 రైళ్లు ఆగేవి..

చెన్నై - హౌరా రూట్‌లోని గన్నవరం రైల్వేస్టేషన్‌ను బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మించారు. గతంలో ఈ రైల్వేస్టేషన్‌కు ప్రయాణికుల ఆదరణ బాగానే ఉండేది. రోజుకు సగటున పది రైళ్లు వరకు ఇక్కడే ఆగేవి. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ, రాజమండ్రి, కాకినాడకు రైళ్లు అందుబాటులో ఉండేవి. ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా రైల్వేస్టేషన్‌లో సదుపాయలు అందుబాటులోకి రాలేదు. ఇటీవల కాలంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, మైనర్ మరమ్మతులు మినహా పెద్దగా మార్పులు జరగలేదు. కనీస తాగునీటి వసతులు లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ లోపం కారణంగా మూలనపడ్డాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు గోతులమయంగా మారి, ఇరువైపులా దట్టంగా ముళ్లకంచెలు పెరిగాయి. వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగకపోవడం వల్ల రాత్రివేళలో రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు ప్రయాణికులు భయపడే పరిస్థితి నెలకొంది. గన్నవరం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లాంటే రెండు కిలోమీటర్లు దూరం లోపలికి ప్రయాణించాలి. రైల్వేస్టేషన్ సమీపంలోని గన్నవరం - ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డులో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మించినప్పటికి ప్రయాణికుల సౌకర్యార్థం మెట్ల మార్గం మాత్రం ఏర్పాటు చేయలేదు.

నాలుగు రైళ్లకే హాల్ట్..

ప్రయాణికుల ఆదరణ లేకపోవడంతో గత పదేళ్లలో ఇక్కడే ఆగే రైళ్ల సంఖ్య పది నుంచి నాలుగుకు పడిపోయింది. ఉదయం కాకినాడ, రాజమండ్రి నుంచి విజయవాడ వచ్చే మెమో రైళ్లు ఒక నిమిషం పాటు ఇక్కడ ఆగుతున్నాయి. సాయంత్రం విజయవాడ నుంచి కాకినాడ, రాజమండి వెళ్లే మెమో ట్రైన్‌లు ఆగుతున్నాయి. ఈ రైళ్లలో రోజుకు 30 నుంచి 50 మంది మాత్రమే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని స్టేషన్ అధికారులు చెబుతున్నారు. జనరల్ టిక్కెట్ల విక్రయాలు ద్వారా వచ్చే రోజువారి ఆదాయం రూ.500 కూడా ఉండడం లేదని పేర్కొంటున్నారు. అయితే విజయవాడ రైల్వేస్టేషన్‌పై పెరుగుతున్న ప్రయాణికుల భారాన్ని తగ్గించేందుకు శాటిలైట్ స్టేషన్‌గా దీనిని ఆధునికీకరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అందుకు అనుగుణంగా అమృత్ భారత్ పథకం ద్వారా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసి ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ సదుపాయం కల్పించాలని విన్నవిస్తున్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు.

కూటమి పాలనలో దళితులపై పెచ్చుమీరిన దాడులు



వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి

కంకిపాడు: కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు పెచ్చుమీరాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు విమర్శించారు. కంకిపాడులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి రోజూ దళితులు లక్ష్యంగా దాడులు, అకృత్యాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. దాడులను ప్రతిఘటించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర వహించటం బాధాకరమన్నారు. దాడులకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుని, బాధిత దళితులకు అండగా నిలవాల్సిన బాధ్యత పోలీసుశాఖదేనని స్పష్టం చేశారు. అధికారులు ఉదాసీనంగా వ్యవహరించటం వల్ల దళితులకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బ్రిటిష్ వారిని తరిమికొట్టినట్టుగా ప్రజలు పాలకులను తరిమికొట్టే రోజులు వస్తాయన్నారు. శాంతియుతంగా దళితుల పక్షాన ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని చెప్పారు.

సీతారాం ఏచూరికి నివాళి

కృష్ణలంక(విజయవాడతూర్పు): స్థానిక రాణిగారి తోట, 18వ డివిజన్‌లో సీపీఎం తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సీపీఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. సీపీఎం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు డి.వరప్రసాద్, టి.చంద్రశేఖర్, కందుకూరి వెంకటేశ్వరావు, గురవయ్య పాల్గొన్నారు.

పోరంకి మీ సేవా కేంద్రంలో మాయాజాలం



పోరంకిలో మూసి ఉన్న మీ సేవా కేంద్రం

పెనమలూరు: ప్రజలను మోసం చేయటంలో మోసగాళ్లు ఆరి తేరారు. తాజాగా పోరంకిలో మీసేవా కేంద్రం నిర్వాహకుడు ప్రజల వద్ద విద్యుత్ బిల్లులకు సొమ్ము తీసుకోని రశీదులు ఇచ్చి ఆ నగదు ప్రభుత్వానికి జమ చేయకుండా మోసం చేశాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకిలో మీసేవా కేంద్రాన్ని ఓ వ్యక్తి నడుపుతున్నాడు. గత నెలలో అతని వద్దకు విద్యుత్ బిల్లులతో పాటు ఇతర అవసరాలకు ప్రజలు సొమ్ము చెల్లించి రశీదులు తీసుకున్నారు. అయితే గత నెలలో చెల్లించి రశీదు తీసుకున్న వారికి సొమ్ము ముట్టలేదని ఆయా శాఖల నుంచి బకాయిలు వచ్చాయి. ప్రధానంగా గత నెలలో విద్యుత్ బిల్లు చాలా మంది విద్యుత్ వినియోగారులు మీసేవాలో చెల్లించారు. వారికి మీసేవా కేంద్రం నిర్వాహకుడు సొమ్ము చెల్లించిన రశీదులు ఇచ్చారు. అయితే ఈ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులో గత నెల విద్యుత్ బిల్లు చెల్లించలేదని విద్యుత్ శాఖ బకాయి చూపింది. దీంతో విద్యుత్ వినియోగదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మీసేవా కేంద్రం వద్దకు రశీదులతో గురువారం వచ్చారు. మీసేవా కేంద్రం మూసి ఉంది. అతని కోసం చాలా సమయం జనాలు ఎదురు చేశారు. అయితే అతని ఆచూకీ తెలియక పోవటంతో విద్యుత్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా తమకు సంబంధం లేదని అధికారులు తెలిపారు. మీ సేవా కేంద్రం నిర్వాహకుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించాలి



గన్నవరంరూరల్: 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను వెంటనే నియమించి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, కొండపావులూరు, బీబీగూడెం గ్రామాల్లోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఇప్పటికీ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని కనీసం ఒక్క డీఏ అయిన ఇవ్వాలని ఉద్యోగులు ఆశతో ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలతో మాట్లాడే తీరిక లేకపోవటం బాధాకరమన్నారు. పీఆర్సీ, ఐఆర్‌ల ప్రస్తావన చేయటం లేదని చెప్పారు. ప్రభుత్వం తెచ్చిన 9రకాల పాఠశాలల విధానం వికటించిందన్నారు. దేశంలో అత్యధిక ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్న రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం మారిందన్నారు. ఈ పరిస్థితి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్యా వ్యవస్థ కుంటుపడే విధానాలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలన్నారు. ఉద్యోగ, కార్మిక, పెన్షనర్‌ల సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అనిల్‌బాబు, అశోక్, శ్రీధర్, అబ్దుల్ బషీర్, ఎం.ఆనంద్‌కుమార్, డి.సురేష్ పాల్గొన్నారు.

22 నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ కార్యవర్గం

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీదేవి దసరా శరన్నవ రాత్రుల మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ...ఆలయంలో దసరా ఉత్సవాలు 25 ఏళ్లు పూర్తి చేసుకుని 26వ ఏడాది నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 22న బాలా త్రిపురసుందరీదేవిగా, 23న గాయత్రిదేవిగా, 24న అన్నపూర్ణాదేవిగా, 25న కాత్యాయనిదేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. 27న లలితాత్రిపురసుందరీదేవిగా, 28న మహాచండీదేవిగా, 29న సరస్వతీదేవిగా, 30న శ్రీదుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్దనిదేవిగా, 2న శ్రీరాజరాజేశ్వరిదేవిగా అమ్మవారిని అలంకరించనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సామూహిక లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ కోశాధికారి జాస్తి ఫణిశేఖర్, కార్యదర్శి కాసన్నేని వెంకటేశ్వరరావు(నాని), ప్రచార కార్యదర్శి జాస్తి శ్రీనివాసరావు, సభ్యులు మోదుగుమూడి వేణుగోపాలరావు, చిమట శ్రీనివాసరావు, పెడసనగంటి రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చినకంచిలో 22 నుంచి ఉత్సవాలు

నున్న(విజయవాడరూరల్): శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి వారి దేవస్థానం చినకంచిలో ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీకామాక్షి అమ్మవారి శరన్నవరాత్రి(దసరా) మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల్లో ప్రతి రోజు శ్రీ కామాక్షి అమ్మవారు ఒక్కో రూపంలో దర్శనమిస్తారన్నారు 22న కామాక్షి దేవి, 23న బాలాత్రిపురసుందరీ దేవి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి 26న మహాలక్ష్మీదేవి, 27న లలితాత్రిపుర సుందరీ దేవి, 28న మీనాక్షిదేవి, 29 శ్రీసరస్వతీదేవి(మూలనక్షత్రం), 30న శ్రీదుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్దనిదేవి, 2న రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని శర్మ కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో హెచ్ఎం రమణగోపాల్, ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌కు బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్ఎం మానుకొండ రమణగోపాల్ గురువారం తెలిపారు. ఇటీవల కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన సెలక్షన్స్‌లో ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చాటారన్నారు. బాలుర విభాగంలో సీహెచ్ ప్రకాష్, ఎస్.యశ్వంత్, సీహెచ్ సాయి ప్రకాష్, జె.జెస్సిన్, జి.కార్తీక్, బాలికల విభాగంలో దేవిప్రియ, జి.ధరణి ఎంపికయ్యారని చెప్పారు. త్వరలో నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌కు కృష్ణాజిల్లా జట్టుకు ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనున్నారని రమణగోపాల్ తెలిపారు. విద్యార్థులతో పాటుగా వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కోలా వెంకట రామారావును అభినందించారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



సాయిప్రశాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మాధవీలత

గన్నవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్-19 పోటీలకు స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్‌కు చెందిన విద్యార్థి మానికొండ సాయిప్రశాంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.మాధవీలత తెలిపారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో సాయిప్రశాంత్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ నెల 10న విజయవాడలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా సెలక్షన్స్ జరిగాయన్నారు. సాబర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయిప్రశాంత్‌ను సెలక్టర్లు జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వచ్చే నెలలో గుంటూరు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో సాయిప్రశాంత్ పాల్గొంటారని చెప్పారు. అనంతరం అతడిని ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించింది.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

పటమట(విజయవాడతూర్పు): కొత్త రాజరాజేశ్వరీపేటలో పైప్ లైన్ల ద్వారా సరఫరా అవుతున్న నీళ్లను కేవలం వాడుటకు మాత్రమే ఉపయోగించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా విజయవాడ నగరపాలక సంస్థ వారు సరఫరా చేసే నీరును కేవలం వాడుటకు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. తాగునీటి కోసం ట్యాంకర్లు, బబుల్స్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో యువ ఎంట్రప్రెన్యూర్ల పాత్ర కీలకం





మాట్లాడుతున్న వేణుగోపాల్

నున్న(విజయవాడరూరల్): దేశ ఆర్థికాభివృద్ధిలో యువ ఎంట్రప్రెన్యూర్ల పాత్ర కీలకమని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ అన్నారు. నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వేణుగోపాల్ మాట్లాడుతూ.. స్టార్టప్ అవకాశాలు, వ్యాపారానికి సంబంధించిన పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఎటువంటి పరిశ్రమలు స్థాపించాలి, నిధుల సమీకరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం తదితర అంశాలను వివరించారు. ఎంఎస్ఎంఈ రిసోర్స్‌పర్సన్ శివనారాయణ మాట్లాడుతూ.. ఎటువంటి పరిశ్రమలు ఎలాంటి ప్రాంతాల్లో నెలకొల్పాలి, వాటికున్న వ్యాపార అవకాశాలు తదితర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశ్రమల స్థాపనకు డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టును తయారు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సార్కేలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, ఆర్ఎఫ్ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని సుమారు 100 మందికి పైగా రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల ప్రాణదాతలుగా నిలవచ్చునన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రమేష్, ఎన్ఎస్ఎస్ పీవో చిన్ని, కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, సెక్రటరీ శ్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెనమలూరు: అగ్ని ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మంచినేని స్వరూపారాణి(50) ఆమె భర్త సత్యనారాయణ కానూరులో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ కూరగాయల వ్యాపారం చేస్తాడు. గత నెల 1న స్వరూపారాణి పూజ చేస్తున్న సమయంలో ఆమె చీర స్టౌవ్‌లో పడి అగ్నిప్రమాదానికి గురైంది. ఆమె కాళ్లు, నడుము కాలి తీవ్రంగా గాయపడింది. ఆమెను విజయవాడలో వైద్య చికిత్స చేయించారు. అయితే కాలిన గాయాలు మానక పోవటంతో ఆమె బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

పెనమలూరు: పెదపులిపాక రోడ్డులో జరిగిన ప్రమాదంలో దంపతులకు గాయాలు కావటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామంలో రామదాసు పెంటయ్య, సత్య దంపతులు నివాసం ఉంటున్నారు. భార్య విజయవాడలో రెస్టారెంట్‌లో పని చేస్తుంది. పెంటయ్య ఆటోనగర్ వద్ద భార్య సత్యను బైక్ ఎక్కించుకోని ఇంటికి వస్తుండగా లాకు సెంటర్ దాటిన తరువాత పెదపులిపాక రోడ్డులో ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో దంపతులకు గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ల్యాబ్ రిపోర్టులు పరిశీలించాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఆర్వో ప్లాంట్లలో నీటి శుద్ధత ల్యాబ్ రిపోర్టులు పరిశీలించి వారికి ట్రేడ్ లైసెన్స్, వాటర్ టెస్టింగ్ తాజా ల్యాబ్ రిపోర్ట్ లేకపోయినా వెంటనే సీజ్ చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శాఖాధిపతులు, ప్రజారోగ్యం విభాగం సిబ్బందితో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తమ పరిధిలో గల ఆర్వో ప్లాంట్ల ద్వారా తాగునీటి సరఫరా వ్యాపారం చేస్తున్న వారిని పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్‌లు, నీటి పరీక్షల ల్యాబ్ రిపోర్ట్ లేకపోతే వెంటనే ప్లాంట్లు మూసివేసే విధంగా చూడాలని పేర్కొన్నారు. నగర పరిధిలో ఎన్ని ప్లాంట్‌లు ఉన్నాయో తనకు నివేదించాలని ఆదేశించారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఏపీ గ్రామీణ బ్యాంక్ చైర్మన్, జీఎంలకు బీఎంఎస్ నాయకుల వినతి



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో పనిచేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీజీబీ బీఎంఎస్ నాయకులు ఆ బ్యాంకు చైర్మన్ కె ప్రమోద్‌కుమార్‌రెడ్డి, జనరల్ మేనేజర్ రఘునాథరెడ్డిలను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ మేరకు సంఘ నాయకులు జి.వెంగళరెడ్డి, డీపీఎస్ రావు తదితరులు గురువారం వారిని కలిసి సమస్యల గురించి వివరించారు. వాటి విషయంలో చైర్మన్ సానుకూలగా స్పందించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాగా చైర్మన్, జీఎంలను కలిసిన వారిలో సంఘ నాయకులు ఎం.అంకయ్య, బాషా, ప్రసాదరావు, ఎం.బజారి ఉన్నారు.